

## సత్తా చాటిన జిమ్నాస్ట్‌లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి : సుచిత్రలోని వీజే జిమ్నాస్టిక్స్ వేదికగా జరిగిన 27వ రంగారెడ్డి జిల్లా జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ శనివారంతో ముగిసింది. పోటీల్లో ఆఖరి రోజు వీజే జిమ్నాస్టిక్స్ అకాడమీ ప్లేయర్లు మొత్తం 26 పతకాలతో సత్తా చాటారు. ఇందులో ఎనిమిది స్వర్ణాలు సహా 11 రజతాలు, ఏడు కాంస్య పతకాలు ఉన్నాయి. సాధు వస్వాని 15 పతకాలు, బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ 16 పతకాలను సొంతం చేసుకున్నాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి అదనపు డీసీపీ సత్యనారాయణ, సురేశ్‌రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ

సిటీబ్యూరో, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంత అవసరమో అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో పేద ప్రజల కోసం నవతెలంగాణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి శనివారం తెలిపారు. ఈనెల 20వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు వయోపరిమితి లేదని, కనీస అర్హత 10వ తరగతి ఉండాలన్నారు. తెలుగు డీటీపీ, ఇంగ్లిష్ డీటీపీతోపాటు టైప్‌రైటింగ్, పేజీమేకర్, క్వార్క్ ఎక్స్‌ప్రెస్ (న్యూస్ పేపర్ సెటింగ్స్), ఫొటోషాప్ డిజైనింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాల కోసం 94900 99540లో సంప్రదించాలని కోరారు.

## పంచాయతీ పోరుకు కసరత్తు

- ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల ప్రణాళికను సిద్ధం చేసే పనిలో అధికారుల నిమగ్నం
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు.. 606 వార్డులు



మేడ్చల్, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీల పోరుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. సర్పంచుల పదవీకాలం మరో 54 రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ గ్రామ పంచాయతీల ఎన్నికలను నిర్వహించేలా అవసరమైన ఎన్నికల అధికారులు, సిబ్బందిని గుర్తించాలని పంచాయతీరాజ్ శాఖ, జిల్లా అధికారులను ఆదేశించింది. ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది వివరాలను సేకరించాలని సూచించింది. దీంతో జిల్లా డీపీవో కార్యాలయంలో వివరాలను సేకరించే పనిని ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అవసరమైన మార్గదర్శకాల జారీ నేపథ్యంలో అధికారులు ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వచ్చే సంవత్సరం 2024 ఫిబ్రవరి 1 వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగియనుంది. 2019 సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచుల ఎన్నికలు జరిగిన విషయం విధితమే.

### జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు..

జిల్లా వ్యాప్తంగా 61 గ్రామ పంచాయతీలు, 606 వార్డులు ఉండగా ప్రస్తుతం మెజార్టీ సర్పంచులు, వార్డు సభ్యులందరూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో గ్రామీణ ప్రాంతాల్లో త్వరలోనే ఎన్నికల కోలాహలం ప్రారంభం కానుంది. అయితే సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికలు వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో నిర్వహించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

### ఎన్నికలు జరిగే అవకాశం ఉందా..?

రెండు రోజుల కిత్రమే నూతన ప్రభుత్వం ఏర్పడిన క్రమంలో వచ్చే ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తారా ? లేదా ? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూతనంగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను సకాలంలో నిర్వహిస్తారా లేదా అన్నది త్వరలోనే తెలిపోనుంది. కాగా ఎన్నికల నిర్వహణ ప్రణాళిక ప్రక్రియను సిద్ధం చేసి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు త్వరలోనే పంపించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. అయితే సర్పంచులకు ఉన్న రిజర్వేషన్లు ఇదే విధంగా ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

2014



2019



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న అప్పటి సీఎం కేసీఆర్

2023



తెలంగాణ ప్రజల ఆత్మబంధానికి వారధి అయిన గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపాన్ని శాసనసభ ప్రారంభోత్సవం సందర్భంగా అలంకరించకపోవడంతో వెలవెలబోతున్నది

# వెలవెలబోయిన అమరవీరుల స్థూపం

**అలంకరణకు నోచుకోని వైనం**

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజల ఆత్మబంధానికి వారధి గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం. అసెంబ్లీకి ఎదురుగా ఉన్న ఈ స్థూపం తెలంగాణ ఆత్మకు ప్రతీకగా నిలుస్తూ వస్తున్నది. రాష్ట్ర అవతరణ వేడుకలు, అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు జరిగినా స్థూపం వద్ద ప్రజాప్రతినిధులు నివాళులర్పిస్తారు. 2014, 2019 ఎన్నికల్లో ఏర్పడిన రెండు శాసనసభల ప్రారంభోత్సవాల సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ సహ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరూ అమరవీరులకు నివాళులర్పించి సభకు హాజరయ్యే ఆనవాయితీని కొనసాగించారు. అయితే శనివారం తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ తొలి సమావేశం ప్రారంభమైంది. రాష్ట్రంలో తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులంతా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం సరిగ్గా 14 ఏండ్ల కింద ప్రకటించిన రోజే (సోనియాగాంధీ జన్మదినం) తాము ప్రమాణ స్వీకారం చేస్తున్నామని, అమరవీరుల ఆశయాల సాధన కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. అయితే తొలిరోజు గన్‌పార్క్‌ను అలంకరించకపోవడం చర్చనీయాంశమైంది. కాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాత్రం ఆనవాయితీ ప్రకారం అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ముందు అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.

# వినూత్న ఆవిష్కర్తలు.. నేటితరం విద్యార్థులు

**రేడియో క్లబ్ వార్షిక సదస్సులో ఆకట్టుకున్న విద్యార్థుల ఆవిష్కరణలు**

సిటీబ్యూరో, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ) : వారంతా 10లోపు చదువుతున్న రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు. వారికి విద్యాబుద్ధులు నేర్పించడంతో ఆగిపోకుండా వారిలో దాగి ఉన్న వినూత్న ఆవిష్కరణలకు రూపాన్ని తీసుకువచ్చేలా రెసిడెన్షియల్ విద్యాసంస్థలు తయారయ్యాయి. ఎమర్జింగ్ టెక్నాలజీగా పిలిచే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా పనిచేసే చాట్ జీపీటీని వినియోగించి ప్రత్యేక కోడింగ్ ద్వారా పనిచేసే సాంకేతికతను రూపొందించే స్థాయికి ఎదిగారు. అలా విద్యార్థుల్లో మేథో మథనం చేయగా వచ్చిన ఆలోచనలే వినూత్న ఆవిష్కరణలకు ప్రోత్సహించాయి. తాజాగా నల్గొండలోని డిండీ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన 10మంది విద్యార్థులు వెదర్, ఎయిర్ క్వాలిటీ, ఎల్‌పీజీ లీకేజీలను గుర్తించే డివైజ్‌ను రూపొందించారు. అదేవిధంగా తక్కువ ఫ్రీక్వెన్సీతో పనిచేసే రాడార్, ఆటోమేటిక్‌గా పనిచేసే డస్ట్ బీన్‌లను కూడా తయారు చేశారు. అలా రూపొందించిన ఆవిష్కరణలను బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజనీరింగ్ కాలేజీ వేదికగా సాగుతున్న లామాఖాన్ అమెచ్యూర్ రేడియో క్లబ్ వార్షిక సదస్సులో ప్రదర్శించారు. లో ఫ్రీక్వెన్సీ పరిధిలో పనిచేసే ఈ డివైజ్‌లు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నల్గొండ జిల్లా డిండి తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులు 10 మంది రూపొందించిన మూడు ప్రత్యేక డివైజ్‌లతో అమెచ్యూర్ రేడియో వార్షిక సదస్సులో పాల్గొన్నారు. వెదర్ స్టేషన్, ఎల్పీజీ లీకేజీలను గుర్తించేందుకు వీలుగా ప్రత్యేక డివైజ్‌ను శ్రవణ్, బన్నీ, రెహాన్ రూపొందించారు. ఫిజిక్స్ ఉపాధ్యాయుడి సాయంతో సెన్సార్లను వినియోగించి తయారు చేసినట్లు తెలిపారు. చాట్ జీపీటీ ద్వారా అవసరమైన కోడింగ్‌ను పొంది డివైజ్ రూపొందించినట్లు వివరించారు. ప్రస్తుతం వెదర్ స్టేషన్ డివైజ్‌లూ, మొబైల్‌లో అందుబాటులో ఉండే టూల్స్ కంటే భిన్నంగా పని చేస్తుందని, శాటిలైట్ ఆధారంగా సేకరించిన సమాచారాన్ని మాత్రమే లభ్యమవుతుందన్నారు. కానీ తమ డివైజ్ రియల్ టైం సమాచారం మాత్రమే చూపుతుందని, అదీ కూడా డివైజ్ ఏర్పాటు చేసుకున్న ప్రాంతంలోనే ఉంటుందని, దీని ద్వారా హోం పొల్యూషన్ తీవ్రతను సమర్థవంతంగా గుర్తించవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా ఇదే స్కూల్‌లో చదువుతున్న మరో ఏడుగురు విద్యార్థులు అబ్జెక్టివ్ రికగ్నైజింగ్ డివైజ్, ఆటోమేటిక్‌గా పనిచేసే డస్ట్ బీన్‌లను ప్రదర్శించారు.



ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న నల్గొండ జిల్లా డిండి రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు



రేడియో క్లబ్ ఆవిష్కరణలను పరిశీలిస్తున్న తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్ రెడ్డి